

# సృష్టినిజం

గాజు గొట్టంలో ఎర్రగా మెరుస్తున్న మందు:

జీవం నింపుకొన్నట్టు సన్నని కదలిక:
గాజుగొట్టం పగులగొట్టిన చప్పుడు!

జీవితంలోని చివరి అధ్యాయంలా నిరాశకు ప్రతీకగా వెలుగుతున్న దీపకాంతిలో, జీవం సిరెంజిలోకి దిగుతున్న నిశ్శబ్దపు ధ్వని:

గదినిండా జీవంలేని వెల్తురు. గదిలో మంచంమీద జీవం మిగిలిన తండ్రి. జీవితపు చివరి అంకంలో నిలబడి మృత్యువుతో సాగిస్తున్న

పెనుగులాట ఆయాసరూపంలో కనిపిస్తోంది. ఊపిరి అందక ఆయనవక్షం ఎగిరెగిరి పడుతోంది.

రక్తం గూడుకట్టుకున్న కళ్ళతో తండ్రివంకే చూస్తున్నాడు శంకరం బెదిరిపోయిన లేడిపిల్లలా. తండ్రి మంచానికి దూరంగా నిలబడ్డారు తమ్ముళ్ళిద్దరూ! వాళ్ళ కళ్ళనిండా నీరు! ముఖంనిండా దైన్యం! గుండెలనిండా గుబులు. అమ్మ గదిలో ఒక వారగా నిలబడి నిశ్శబ్దంగా రోదిస్తోంది. అమ్మ కొంగు పట్టుకొని భయం భయంగా చూస్తోంది చెల్లాయి.

మందు నిండిన సిరెంజితో డాక్టరు చేతులు ముందుకు కదిలాయి! ఆయాస పడుతున్న తండ్రిమీదకు వంగాయి.

మృత్యువుతో సాగిస్తున్న పోరాటానికి ఆయుధాన్ని అందిస్తున్నట్టు ఇంజెక్షన్ చేసి దూరంగా నిలబడి ఫలితానికి ఎదురు చూస్తున్నాడు డాక్టరు.

నిరాశగా ఆయన పెదవులు విడివడి గీతల్లా సాగిపోయాయి!

శంకరం గుండె పగిలినట్లయింది.

మనో సముద్రంలోని దుఃఖం చెలియలికట్ట దాటే యత్నం చేస్తోంది.

తండ్రికేసి ఆశగా చూశాడు శంకరం.

ఎగిరెగిరి పడుతున్న వక్షంలో చలనం స్థంభించింది.

కాదు! ప్రపంచగమనమే స్థంభించిన అనుభూతి!

చెదిరిన గుండెతో డాక్టరువంక చూశాడు శంకరం. ఆయనఅప్పుడే బయటకు వెళ్ళిపోయాడు! గాభరాగా అడుగులేసుకొంటూ డాక్టరు వెనక వెళ్ళాడు.

"సారీ! శంకరం! ఈ సమయంలో నువ్వు ధైర్యంగా వుండాలి. నేను చేయగల్గింది చేశాను!"

తరువాత మాటలు శంకరానికి వినబడలేదు.

స్కూటర్ స్టార్టు అయిన ధ్వని! గుండెల్ని చీలుస్తున్నట్లు చప్పుడు చీకటిని చీల్చుకొంటూ ముందుకు సాగిపోయింది.

శంకరం చుట్టూ చీకటి!
చీకట్లో మిగిలిపోయాడు శంకరం.

అతని కళ్ళనిండా చీకటి! మనసునిండా చీకటి! గుండెలమీద చేతులతో రాసుకొంటూ భయంగా బెదురుగా చుట్టూ చూశాడు! ప్రపంచంనిండా చీకటి! విశ్వంనిండా వ్యాపించిన చీకటి! కనుల కొలకులనుండి జారిన కన్నీళ్ళను ఒత్తుకుంటూ లోపలికి వెళ్ళాడు.

చెల్లాయి, తమ్ముళ్ళు తండ్రి శవంమీద పడి అనాధల్లా ఏడుస్తున్నారు.

కాళ్ళవేపున పడి తల నేలకేసి బాదుకుంటోంది తల్లి. జుత్తు పీకేసుకొని పిచ్చిదానిలా అరుస్తోంది! సముద్రాలు ఏకమైపొంగి భూమిని మింగేటప్పటి ప్రజల ఆక్రందన అది.

ఇప్పటివరకూ ఆయన పిల్లలను ఆప్యాయంగా పెంచిన తండ్రి! అమ్మకు సర్వస్వం అయిన భర్త! ఊళ్ళోవాళ్ళకు అత్యంత ప్రీతిపాత్రమైన ఉపాధ్యాయుడు! కాని ఈ క్షణంనుండి ఎవళ్ళకూ ఏమీ కాడు! రేపు ఉదయానికి కొన్నిలక్షల మైళ్ళ వైశాల్యం కలిగిన ఈ భూమాత ఒడిలో మిగలబోయే పిడికెడు బుగ్గి! కాకపోతే బుట్టెడు అస్థికలు; అంతే!

శంకరానికి కాళ్ళక్రింద భూమి చీలిపోతున్నట్లుంది.
నరాలన్నీ పట్టు తప్పినట్లయిపోయాయి.
రేపటినుండీ ఈ బ్రతుకులెలా కడతేరటం?

తనకొచ్చే రెండువందల రూపాయల జీతంతో ఈ అయిదుజీవాలు ఎలా బ్రతుకుతాయి? తమ్ముళ్ళను ఎలా చదివించటం? చెల్లాయికి యెలా పెళ్ళి చేయటం? తల్లికి శాశ్వతంగా కలిగిన ఈ లోటును ఎలా తీర్చటం?

భగవాన్! ఎలా తీర్చటం? ఏ విధంగా తీర్చటం?
తన తండ్రిలేని భవిష్యత్తును ఊహించలేకపోయాడు శంకరం!

తన గుండెను ఎవరో బలంగా అదిమిపట్టి నొక్కేస్తున్నట్టు అనిపించింది. ఊపిరాడని గదిలో బంధించినట్లుంది. చెల్లాయి ఆక్రందన విన

టానికి భయం! తమ్ముళ్ళ భవిష్యత్తు వూహించటానికి భయం. తల్లి ముఖం చూడటానికి భయం. తండ్రి శవానికి దగ్గరగా వెళ్ళటానికి భయం. అడుగుతీసి అడుగు వెయ్యటానికి భయం.

ఒంటినిండా, గుండెలనిండా, రక్తంనిండా, మనసునిండా, పేరుకొంటున్న భయం. వూడలు దింపుపుంటున్న భయం. పాపంలా పరచుకొంటున్న భయం.

శంకరం నేలమీద కూలబడిపోయాడు.

మోకాళ్ళమధ్య తల దూర్చుకొని బావురుమన్నాడు.

* * *

సెకనులు నిమిషాల్లా కదులుతున్నాయి.

నిమిషాలు గంటల్లా పాకుతున్నాయి.

తెల్లగా తెల్లవారింది. శవంమీద పడిఇంకా రోదిస్తూనే వుంది తల్లి. భర్తతోపాటు తననుకూడా తీసుకుపొమ్మని దేవుళ్ళందరికీ మొక్కుతూనే వుంది! ఏడ్చి ఏడ్చి ఇక ఏడవటానికి ఓపికలేక తమ్ముళ్ళిద్దరూ తండ్రి శవం ప్రక్కనే పడి నిద్రపోతున్నారు. చెల్లాయి అమ్మమీదపడి పూనకం వచ్చినదానిలా అరుస్తూ ఏడుస్తోంది!

శంకరం మెదడంతా ఖాళీ అయినట్లనిపించింది.

రాత్రి తెల్లవార్లూ నిద్రలేక పోవటంవలన తలనొప్పితో కణతలు పగిలిపోతున్నాయి.

వీధిలోని పెద్ద లొక్కొక్కరే చేరుతున్నారు.

తలోప్రక్కా నిలబడి అనునయ వాక్యాలేవో చెపుతున్నారు. అవేమి తనకు అర్థం కావటంలేదు.

అర్థమైనదల్లా ఒక్కటే!

అది విపంకన్న భయంకరమైన సత్యం.

తండ్రి తనకిక లేడన్న ఘోరమైన సత్యం.

పెద్దలంతా జరుగవలసినతంతు గురించి ఆలోచనలు జరుపు

తున్నారు. ప్రక్కింటి మాష్టారు దగ్గరవుండి పనులన్నీ పురమాయిస్తు న్నారు. తనకు తెలియకుండానే శవవాహనానికి కావాల్సిన సరంజామా అంతా ఇంటిముంగిట చేరింది.

విరామం తెలియకుండా రోదిస్తున్న అమ్మకు చుట్టుప్రక్కల ఆడ వాళ్ళు వేదాంతం చెపుతున్నారు. వెడలిపోయేది తనువేకాని ఆత్మకాదని వక్కాణిస్తున్నారు. శరీరం అనిత్యమనీ, ఆత్మ వొక్కటే చావు లేనిదనీ, అదెప్పుడూ మనతోనే వుంటుందనీ వివరిస్తున్నారు. అమ్మ ఈ మాటల్ని అర్థం చేసుకొనేయత్నం కూడా కనీసం చేయటంలేదు. తనకు జరిగిన అన్యాయానికి అమాయకంగా హృదయం కరిగేలా ఏడుస్తోంది.

తనకు దేవుడు కల్పించిన లోటును రోదనే తీరుస్తుందనే టంతటి పిచ్చినమ్మకంతో పోయిన తన దేవుడు తిరిగి వస్తాడనేటంతటి నిశ్చలవిశ్వా సంతో విలపిస్తోంది. గుండెలు బాదుకుంటోంది. జుత్తు పీక్కుంటోంది. శంకరం అటువేపు మరి చూడలేక లోపలి గదిలోకి వెళ్ళిపోయాడు. తన వెనకాలే ప్రక్కింటి మాష్టారు వచ్చేరు.

"చూడు శంకరం!...."

శంకరం తలెత్తి చూశాడు. అనుకోకుండానే గుండెల్లోంచీ దుఃఖం పెల్లుబికింది. గొంతు బొంగురుపోయింది.

"మాష్టారూ!" అంటూ పసిపిల్లాడిలా ఆయన చేతుల్లో వాలిపో యాడు.

ఆయన వేళ్ళు శంకరం తలమీద సుతారంగా ఆప్యాయంగా కదిలేయి.

"శంకరం! నువ్వు పెద్దవాడివి! నువ్వే ఇలా అధైర్యపడితే అపసి వాళ్ళ సంగతేమిటి? అదీగాక మీ అమ్మగార్ని ఓదార్చవలసిన బాధ్యత నీది. ఆ మహానుభావుడు సుఖంగా వెళ్ళిపోయాడు. నువ్వు కంటతడి లేకుండా తరువాతి కర్మలన్నీ జరిపిస్తేనే ఆయన ఆత్మకు శాంతి లభిస్తుంది."

మేష్టారి గొంతు బొంగురు పోయింది. తన తండ్రికీ, ఆయనకూ వున్న స్నేహం అలాటిది!

శంకరం మవునంగా వుండిపోయాడు.

"శంకరం! ఇంట్లోంచి శవం ఎంత తొందరగా కదిలితే అంత మంచిది ముందు ఆతంతు చూడాలి." మేష్టారు మెల్లగా అన్నారు.

శంకరానికి మళ్ళీ ఏడుపు ముంచు కొచ్చింది.

"మేష్టారూ! ఈ ఇల్లు ఆయన కట్టించినది. ఈ ఇంట్లోని ప్రతి వస్తువూ ఆయనది. మేమందరం ఆయన మనుషులం. ఆయన ప్రాణం పోగానే ఎంతతొందరగా ఇంట్లోంచి పంపించేస్తే అంత మంచిదనే నిశ్చయానికి వస్తున్నాం. ఎంత దారుణం మాష్టారూ! నిన్నటిదాకా అన్నీ అయిన మనిషి. ఈ దినం ఏమీ కాకుండా అయిపోయారా?" అన్నాడు ఏడుస్తూ.

మేష్టారు చిన్నగా నవ్వేరు!

గీతోపదేశ కాలంలో శ్రీకృష్ణుడు అర్జునిని చూసి పెదవులమీద కదిలించిన నవ్వు అది!

యుద్ధానంతరం, అశోకుడు రణరంగంలోని రక్తాన్నీ, శవాల్నీచూసి చిందించినప్పటి దరహాసం అది.

ఆ చిరునవ్వుతో శంకరం కదిలిపోయాడు.

మేష్టారు అన్నారు.

"అందరం ఒకనాడు ఇలా సాగిపోయేవాళ్ళమే. ముందు వెనుకలు మాత్రమే మనమధ్య మిగిలే వ్యత్యాసం. చివరకు కావాల్సినది ఆరడుగుల నేల. ఆఖరుకు మిగిలేది పిడికెడు బూడిద! ఎవరు చేయాల్సిన విధులు వాళ్ళు నిర్వర్తించాక ఈ లోకంనుండి సాగిపోవడమే జరుగుతుంది. నిన్ను ప్రయోజకునిగా తీర్చిదిద్ది కుటుంబ బాధ్యత నీ కప్పగించారు. అది సక్రమంగా నిర్వర్తించడమే నీ కర్తవ్యం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలంటే ఇదొక శుభంగా భావించి, ఆయన అంత్యక్రియలు జరిపించు. ఈ

కార్యం ఎంత శ్రద్ధతో చేస్తే అంత మంచిది. శ్రద్ధతో జరిపేది కనుకనే దీన్ని శ్రాద్ధకర్మగా మన పెద్దలు పేర్కొన్నారు."

శంకరం కన్నీళ్ళు తుడుచుకొని మేష్టారి వెనుక బయటకు వచ్చాడు.

మనసు రాయిచేసుకొని యాంత్రికంగా తతంగం ప్రారంభించాడు. బ్రాహ్మణులు సలహా ఇచ్చినప్రకారం విధులన్నీ నిర్వర్తిస్తున్నాడు. ఏడుకట్ల సవారీ తయారయింది. తండ్రి ప్రేతానికి యధావిధిగా స్నానం చేయించేడు. సవారీమీదకు శవాన్ని తరలించి తడపలతో బిగించి కట్టాడు. కొత్తకుండలో పిడకల మధ్య నిప్పు రాజేశాడు.

ప్రక్కన చేరిన పెద్దలందరూ తలో చెయ్యి వేశారు.

సూర్యుడు నడినెత్తిమీదకు చేరే వేళకు వాహనం లేచింది. మళ్ళీ అందరూ ఘొల్లుమన్నారు. శాశ్వతంగా తండ్రి తనువు ఇంట్లోంచి బయటకు కదిలింది.

నిప్పు పట్టుకొని వాహనం ముందు నడిచేడు.

శ్మశానంలో పేర్చిన చితిమీదకు తండ్రిశవం చేరింది.

మంత్రఘోష మధ్య తలవైపున వుంచిన అగ్ని గంటలోనే ప్రజ్వరిల్లి తండ్రిని తనలో ఇముడ్చుకొంది. చూస్తూండగానే బూడిద, బొగ్గులు కాలుతున్న కట్టెలు, కాలనిబొమికలు, కనులయెదుట మిగిలేయి.

తండ్రికి తర్పణ విడిచేడు.

శ్మశానంలో విడిచిన తర్పణను కాకులు తీసికెళ్ళి పితృ దేవతలకు అందిస్తాయట. ఆ తర్పణ కాకులు తినకపోతే పోయిన మనిషికి ఏవో కోరికలు తీరకుండా వుండిపోయినట్లు నమ్మాలట. చుట్టూచేరిన పెద్దలు అనుకొంటున్నారు. శంకరం అన్నం కలిపి పెట్టిన వెంటనే చుట్టూ పది కాకులు వాలేయి! కావు కావు మని గోలచేస్తూ ఒక్క మెతుకు మిగల్చకుండా ఆరగించి ఎగిరిపోయాయి.

ఎవరో అంటున్నారు.

"మహానుభావుడు! కోరిక లేవీ లేకుండా పోయాడు!"

ప్రేతభూమికి వెనుకగా వున్న నూతివద్ద స్నానంచేసి ఇంటికితిరిగి వచ్చాడు శంకరం.

ఇల్లంతా బావురు మంటోంది.

శరీరంలోని ఏదో భాగం విడిపోయి కనబడకుండా ఎక్కడికో పారిపోయినట్టు అనుభూతి కలిగింది.

లోపలి గదినుండి తల్లిరోదన వినిపిస్తోంది.

నుదుటిన రూపాయి కాసంత బొట్టుతో కళకళలాడే తల్లిముఖం ఇక కళావిహీనంగా తయారవుతుంది.

సంఘం దృష్టిలో ఎదురుపడకూడని స్త్రీగా ఆమె మారిపోతుంది. బోసిమెడతో, కళాకాంతులు లేని ముఖంతో శేషజీవితాన్ని మోడువారిన కట్టెలా గడపాల్సిందే!

తల్లిజ్ఞాపకానికి వచ్చేసరికి అడుగు ముందుకువేసి ఇంటిలోకి వెళ్ళ లేక పోయేడు శంకరం. వీధి అరుగుమీదే కూలబడిపోయేడు నీరసంగా.

హెడ్మాష్టారు, ఎదురింటి ప్లీడరుగారు, అవతలివీధి డాక్టరుగారు, తాలూకాఫీసు గుమాస్తాలు ఒక్కొక్కరే వచ్చి పలకరించి వెళ్ళిపోతు న్నారు అనునయంగా.

అందరి మాటలకూ కన్నీళ్ళతో తల వూపటం తప్ప ఏం చేయ లేకపోయాడు.

శంకరం మనసంతా దిగులుగా ఉంది.

మెదడంతా ఖాళీ అయిపోయినట్టుంది. కడుపులో ఏదో మెలికలు తిరిగిపోతున్న బాధ! సందర్భంలేని దృశ్యాలేవో కనులముందు పొరలు పొరలుగా కదలాడి మస్తిష్కం వెనుకకు జారిపోతున్నాయి- కలల్లోని దృశ్యాలకు మల్లే.

"బాబూ! కాస్త కాఫీ తాగు."

శంకరం తలెత్తి చూశాడు.

పక్కింటివిధవావిడ కాఫీగ్లాసుతో నిలబడింది గుమ్మందగ్గర.

అతనికేమి తాగాలనిపించటం లేదు.

"ఆకలి" అనే పదాన్ని ఎన్నో యుగాలనుంచీమరచిపోయిన మౌన మునిలా ఆమెకేసి చూసి వద్దన్నట్లు తల అడ్డంగా ఊపేడు. కానీ, ముస లావిడ అంత త్వరగా వదిలే మనిషికాదు.

"బాబూ ఎంతో అలసిపోయావు. వంటలయ్యేసరికి ఆలస్యం అవు తుంది. నామాట కాదనక యీ కాస్త కాఫీత్రాగు."

గ్లాసు దగ్గరగా ఉంచి లోనికి వెళ్ళిపోయింది ఆవిడ.

"హుఁ! అలసట! తను చేసిన వీరోచిత కార్యానికి అలసట! భుజాలు వాచిపోయేటట్లు తనను బాల్యంలో మోసి పెంచిన తండ్రి చితికి నిప్పంటించినందుకుగానూ తనకు అలసట! ఆప్యాయత, ప్రేమ రంగ రించి తనను పెద్దచేసినందులకుగాను, ఇవంత బూడిద చేసిన తన ఘన కార్యానికి అలసట! అందుకు తను సాధ్యమైనంత తొందరగా కాఫీ త్రాగి అలసటనుండి కోలుకొని బలం చేకూర్చుకోవాలి.

విరక్తిగా నవ్వుకొని కాఫీగ్లాసందుకొని త్రాగేశాడు.

కడుపులో వెలితి నిండినట్లయింది.

ఎంతో సేపటినుండి కడుపులో కలిచివేసిన అనుభూతి కాస్త ఆకలే ననీ, అది కాఫీతో చల్లారిందనీ అతనికి లీలగా అర్థమైంది.

ప్రక్కింటి మేష్టారు వచ్చి ప్రక్కన కూలబడి ముందు జరగవలసిన కార్యక్రమాలన్నీ వివరిస్తున్నారు. కర్మకాండ యథావిధిగా జరగటానికి కావాల్సిన వస్తువులన్నీ పట్టీరాసి ఇచ్చేరు. సుమారుగా వాటన్నిటికీ ఎంత డబ్బు ఖర్చవుతుందో కూడికలు చేసి లెక్కలు కట్టారు.

డబ్బుప్రసక్తి వచ్చేసరికి శంకరం తృళ్ళిపడ్డాడు!

ఇంత సేపూ దాన్ని గురించిన జ్ఞాపకం తనకులేదు. తండ్రి వెళ్ళి పోయిన పూర్వలోకాలకూ తను మిగిలిన ఈ అధోలోకానికి నిచ్చెనగా కను పించింది డబ్బు!

మనసులో చెలరేగిన వూహలకూ, జరగబోయే యదార్థాలకూ మూల సూత్రంగా ముడిపడి కూర్చుంది డబ్బు. జరిగిపోయిన ఘోరానికీ, జరగ వలసిన భౌతిక కర్మలకూ ముడిపెట్టి నిలబడింది డబ్బు!

మేష్టారు డబ్బుగురించి మాట్లాడగానే తనువు అశాశ్వతమనే వేదాంతం మనసునుంచి ఎగిరిపోయింది. ఆత్మ శాశ్వతమనే ప్రతిపాదన రెక్కలు విప్పుకొని పారిపోయింది. అందరం ఏకనాడు మట్టిలో కలిసి పోవలసిన వాళ్ళమేనన్న సత్యం మనసు వెనక్కు జారిపోయింది. జీవితం మూణ్ణాళ్ళ ముచ్చట అనే అంశం మస్తిష్కం వెనుకను ఏవో పొరల్లోకి దిగిపోయింది.

ఈ లోకంలో అన్నీ అశాశ్వతాలే అయినా, అన్నీ అసత్యాలే అయినా వొక్కటి మాత్రం శాశ్వతమైనదిగా, సత్యమైనదిగా శంకరం కనుల ఎదుట నర్తించింది. అది డబ్బే అని శంకరానికి నూటికి నూరు పాళ్ళు అర్థమైపోయింది.

"ఆత్మకూడా అశాశ్వతమే! డబ్బొక్కటే ఈ లోకంలోని జీవులకూ పూర్వలోకాలోని పితృ దేవతలనూ నడిపించేది! డబ్బొక్కటే వీళ్ళందరినీ కదిలించేది" అని శంకరానికి పూర్తిగా అర్థమైపోయింది.

ఈ అర్థమయిన ఆలోచన మెదడు నిండా నిండేక యాతనఆరంభమైంది!

శంకరం పూర్తిగా భౌతికలోకంలోకి వచ్చేడు.

"మాష్టారూ! ఇంట్లో రెండొందలు మాత్రం వున్నాయి. ఈ పది రోజులలో జరగవలసిన కర్మకాండ ఆ డబ్బుతో పూర్తయ్యేటట్టులేదు. ఇంకొక రెండువందల రూపాయలు ఎక్కడయినా సమకూర్చండి. మీ మేలు మరచిపోలేను" శంకరం ఉద్వేగంతో అన్నాడు.

తనలో ఈ గంటలో కలిగిన మార్పుకు తనకే ఆశ్చర్యం అనిపించింది. గంటక్రితం తండ్రిపోయిన లోటు ఎలా తీరుతుందనే బాధతో

కుమిలిపోయేడు. "ఇప్పుడు ఇంట్లో రెండొందలు లేని లోటు ఎలా భర్తీ అవుతుందా అనే ఆలోచనతో సతమత మవుతున్నాడు.

మేష్టారు భుజంమీద కండువా సర్దుకొని లేచి నిలబడ్డారు.

ఇంత సేపూ శంకరానికి ఎలా ధైర్యం చెప్పటమా అనే సమస్యతో కదిలిపోయేరాయన! ఇప్పుడిక ఆ సమస్య తీరిపోయింది ఆయనకు! శంకరం ముఖంలో తండ్రిపోయిన బాధ సమసిపోయి డబ్బుకోసం పడే మధనం స్పష్టంగా కనిపించింది.

"శంకరం! నేను మార్వాడీ కొట్టుకెళ్ళి డబ్బు తెస్తాను. ఆ విషయంలో నువ్వు బెంగపెట్టుకోకు. లోనికివెళ్ళి పిల్లలకు ధైర్యం చెప్పు. నేను సాయంత్రం మళ్ళీ వస్తాను" అంటూ ఎండలోకి కదిలి పోయారు మేష్టారు.

శంకరం భారంగా లేచాడు.

ఇంట్లో వస్తువులన్నీ అస్తవ్యస్తంగా చెదిరిపోయి వున్నాయి. తండ్రి గదినిండా వింతవాసన. మృత్యువు కదిలి ముందుకు సాగిపోయే దాకా దిగవిడిచిన వూహకందని వాసన. వంటరిగా తండ్రి గదిలోనికి వెళ్ళటానికి భయమేసింది శంకరానికి!

ఆ గదిలో ఒక వారగా ప్రమిదలో నూనెపోసి వత్తివేసి దీపం వెలిగించారు. వత్తి నిలిచి కాలుతోంది. నూని కాలటానికి సహాయపడుతోంది. నూనె అయిపోతే వత్తి ఆరిపోతుంది.

వత్తి భౌతికకాయం: నూని దానిలోని ప్రాణంగా తోచింది శంకరానికి.

కాని కొంత సేపటిలోనే ఆ తర్కం చెదిరిపోయింది.

ప్రాణంకంటే విలువయినదీ, ప్రాణం పోయేక కూడా అవసరమయ్యేదీ, డబ్బే అని శంకరానికి అనిపించింది. మనసులోనే దీపానికి నమస్కరిస్తూ నిలబడిపోయాడు కొన్ని క్షణాలు.

"బాబూ! కాస్త ఎంగిలి పడుదువుగాని రా! ఎప్పుడో నిన్నరాత్రి తిన్న అన్నం!" ప్రక్కింటి విధవావిడ పిలుస్తోంది.

కాళ్ళీడ్చుకొంటూ వెళ్ళి విస్తరి దగ్గర కూలబడ్డాడు.

దుఃఖంతో ముద్ద నోటిలోకి దిగదేమో. అనేఅనుమానం వచ్చింది. కాని ఆ అనుమానం కేవలం భ్రమే అని కొన్ని క్షణాల్లోనే ఋజువైంది. బరువెక్కిన కడుపు అందుకు సాక్ష్యముగా నిలిచింది. రోజూకంటే ఎక్కువ తిన్నట్టు ఫీలయ్యాడు. చిన్న తమ్ముడు అన్నంలోకి పెరుగు లేనందుకు అల్లరి చేస్తున్నాడు. రేపటినుంచి ఈ మజ్జిగనీళ్ళు కూడా వుండని రోజులు ఎదురౌతాయని వాడు వూహించటంలేదు. శంకరం వాణ్ణి నాలుగు కేకలేసి విస్తరి దగ్గర నుండి లేపాడు. వాడు మళ్ళీ చిందులేస్తూ ఏడుపు లంకించుకొన్నాడు. ఎవరో వాణ్ణి సముదాయిస్తున్నారు. శంకరం మనసంతా చికాకుగా వుంది. రాత్రి తెల్లవార్లు నిద్ర లేకపోవటంవలన, కడుపు కాస్త బరువెక్కగానే కనురెపలు మత్తుగా వాలిపోయాయి. నిద్ర లేచేసరికి సాయంత్రం అయిదు గంటలయ్యింది. మత్తుగాలేచి పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కొని వీధివైపుకు వచ్చాడు. వూళ్ళో పెద్దలు ఒక్కొక్కరే వచ్చి పరామర్శిస్తున్నారు. అందరి మాటలూ వింటూ తలవూగిస్తూ వీధిలోని బల్లమీద కూలబడిపోయాడు శంకరం. చీకటి పడింది. వచ్చిన నలుగురూ వెళ్ళిపోయారు.

కొంచెంసేపటిలోనే ఫలహారానికి పిలుపు వచ్చింది. అంతా మామూలే. భోజనం బదులు ఫలహారం కడుపునిండా వెళ్ళింది. తరువాత మళ్ళీ నిద్ర.

* * *

మరునాటి ఉదయం లేచి చెరువు గట్టుకు వెళ్ళి నిత్యవిధి ఆచరించి తండ్రికి తర్పణ విడిచేడు. పక్షుల్నీ భూ, జలచరాలను, ఎవర్నో ఒకర్ని వచ్చి ఆ తర్పణ యమభటులకు అందనీయకుండా వూర్ధ్వలోకానికి ఎగిరిన తండ్రి ఆత్మకు అందచేయమని ప్రార్థించేడు. పురోహితుడు చెప్పిన కర్మ

లన్నీ యథావిధిని నిర్వర్తించేడు. ఆయనకు అందవలసిన మామూలు చిల్లరతో సహా అంతా వసూలు చేసుకొని వెళ్ళిపోయాడు పురోహితుడు.

రోజూ ఉదయాన్నే నిత్యవిధి ఆచరించటం, రాత్రి నిద్రపోవటం తప్ప ఆ దినాల్లో ప్రత్యేకత ఇంకేమి కనబడలేదు. పదకొండో రోజున, పన్నెండో రోజున జరపాల్సిన కర్మలన్నీ శాస్త్రబద్ధంగా జరిపేడు. వచ్చిన బంధువు లందరూ ఏవో సలహాలిచ్చి వెళ్ళిపోయేరు.

పన్నెండో దినంనాటి రాత్రికి కేవలం తనూ, తన తమ్ముళ్ళూ, చెల్లెలూ తల్లీ మాత్రమే ఇంట్లో మిగిలేరు. తండ్రిపోయిననాడు మార్వాడీ నుండి తెచ్చిన అప్పు రెండొందలూకాక, వీధి చివర్న ప్లీడరుగారి దగ్గర తీసుకొన్న అప్పు మరో రెండొందలు కూడా మిగిలింది.

ఆ రాత్రి భోజనంచేసి వరండాలో పడక్కుర్చీలో నడుం వాల్చాడు శంకరం.

పెద్ద తమ్ముడు పుస్తకాలు పట్టుకొని ప్రయివేటుకు బయలుదేరుతూ తనవద్ద ఆగేడు.

“ఏరా ఏమిటి కావాలి?” అన్నాడు.

“ఎల్లుండి పరీక్ష ఫీజు పాతిక రూపాయలు కట్టాలన్నయ్యా! అది కాక ప్రయివేటు మేష్టారి పదిహేను రూపాయ లివ్వాలి” అన్నాడు నసుగుతూ.

“అలాగే” అంటూ తలూపేడు శంకరం.

తమ్ముడు వెళ్ళిపోయాడు.

చెల్లాయి వంటింట్లోని పని ముగించుకొచ్చింది

“అన్నయ్యా!” మెల్లగా పిల్చింది.

“ఊఁ” అన్నాడు శంకరం.

“ఇవాల్టివరకూ జాగ్రత్తగానే వాడేను కాని, ఏం చేయటం? వచ్చే వాళ్ళతో పోయేవాళ్ళతో సరిపోయిందిగా? రేపు ఉదయం బియ్యం, పంచ

దారి తెచ్చుకోవాలి. ముందు కొంచెం తెచ్చుకొంటే తరువాత మొత్తంగా కొనుక్కోవచ్చు."

చెల్లాయి మాటలకు శంకరానికి నవ్వు వచ్చింది.

చెల్లాయి చాలా తెలివయినది. తన మనసు బాధపడకుండా విషయాన్ని చెప్పాలని యత్నిస్తోంది. రేపు కొంచెం తీసుకున్నా తరువాత మొత్తంగా తీసుకున్నా అవన్నీ కేవలం తన జీతం రెండువందల రూపాయల్లోనే అన్న సంగతి ఆమెకు మాత్రం తెలీదూ!

శంకరం మవునంగా వుండిపోయేడు.

"బాబూ! శంకరం!"

శంకరం కనులు విప్పి చూశాడు. గది గుమ్మం దగ్గర తల్లి నిలబడివుంది!

"పిల్చావా అమ్మా!" అన్నాడు మెల్లగా.

"అవును బాబూ! నీకు ఒక విషయం చెప్పాలి!"

"చెప్పమ్మా!" అన్నాడు.

"మరేం లేదురా! మీ చెల్లాయికి తొందరగా ఏదో సంబంధం చూసి ముడి వేసెయ్యాలిరా! ఆరు నెలలలోగా ఈ శుభం జరిగితే చనిపోయిన మీ నాన్నగారి ఆత్మ శాంతిస్తుంది. రేపే గుంటూరు వెళ్ళి ఆ గుమాస్తాగారి అబ్బాయి సంబంధం ఖాయం చేసుకొని రాకూడదూ!"

శంకరం కళ్ళెత్తి తల్లివంక చూశాడు.

పాలిపోయిన ముఖంతో నీరసంగా గుమ్మానికి చేరగిలబడి నిలబడి వుంది ఆమె. తండ్రిపోయిన బాధకంటే కూతురికి పెళ్ళి ఇంకా కాలేదన్న బాధే ఆమె ముఖంలో నిండినట్లనిపించింది.

"అలాగే నమ్మా! ఎల్లుండి వెళతానులే" అన్నాడు.

తన బాధ్యతను తీర్చుకొని వెళ్ళిపోయాడు తండ్రి. తనకు మిగిలిన బాధ్యతగా కూతురి పెళ్ళికోసం అప్పుడే కలవర పడుతోంది తల్లి. పన్నెండు దినాలక్రితం చనిపోయిన తండ్రి అందరి ఆలోచనల నుండి

అప్పుడే నిష్క్రిమించేడు. ఘోరమైన ఆ అశుభాన్ని అప్పుడే మరచి మరో శుభకార్యం చేయటంకోసం ఆయత్తం జరుగుతోంది.

పరీక్షఫీజు కట్టాలని తమ్ముని ఆరాటం!
ఇంట్లో గింజలు నిండుకున్నాయనీ చెల్లాయి బాధ!
కూతురికి పెళ్ళి అవదేమోనని అమ్మ తాపత్రయం!

కాని! శంకరానికి ఇవేవీ మనసులో లేవు. రేపు ఈ కోరికలన్నీ తీర్చడానికి మరో రెండువందలు ఎక్కడ అప్పు తేవటమన్నదే సమస్య. చేసిన అప్పు ఎలా తీర్చటమన్నదే రెండో సమస్య.

డబ్బు గురించే తన ఆరాటం.
డబ్బు గురించే తన బాధ!
డబ్బు గురించే తన తాపత్రయం!
తల్లి తలుపు దగ్గరగావేసి లోనికి వెళ్ళిపోయింది.
శంకరం ఆకాశంవేపు చూస్తూ వుండిపోయేడు.

దశమి వెన్నెలలో లోకాన్ని పాలిస్తున్న చంద్రునికి అడ్డంగా ఒక మేఘం కదిలింది. వెన్నెల పల్చనయింది. కొద్ది క్షణాల్లోనే అది చంద్రుని దాటుకొని ప్రక్కకు వెళ్ళిపోయింది. ఎప్పటిలాగే మళ్ళీ వెన్నెల పరచుకొంది.

ప్రకృతి తనకేదో వింత రహస్యాని బోధిస్తున్నట్లయింది.

రేపటిని గూర్చిన ఆలోచనలను మెదడులో ఒక వారకు నెట్టి నిద్రకుపక్రమించాడు శంకరం!

(కినుక, ఆగష్టు 73)